

ఉపాధి చూపుతున్న విస్తరాకులు

- అడవిని నమ్ముకున్న ఆదివాసీలకు బాసటగా మోదుగ చెట్లు
- మహారాష్ట్ర, ఇతర ప్రాంతాలకు సరఫరా

7లో



పరిశ్రమలో తయారు చేసిన మోదుగ విస్తరాకులు

కూలీల అడ్డా.. కాంటా చౌరస్తా..

- 30 ఏండ్లుగా ఇక్కడే ...
- కూలీ కోసం పలు ప్రాంతాల నుంచి రాక

7లో



పనుల కోసం కూలీలతో మాట్లాడుతున్న ఇంటి యజమాని

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు

తాండూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వే పేరిట సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి నష్టపోవద్దని సీఐ కుమారస్వామి అన్నారు. శనివారం సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సర్వే పేరిట ఎవరైనా ఫోన్‌లో, నేరుగా సంప్రదించిప్పుడు ఆధార్ నెంబర్ తప్ప ఇతర బ్యాంకు ఖాతా వివరాలు, పాన్‌కార్డు నెంబరు, ఓటీపీ వివరాలు, క్రెడిట్ కార్డు నెంబర్లు చెప్పవద్దని సూచించారు. ఎవరైనా అలాంటి విషయాలు అడుగుతున్నారనంటే సైబర్ మోసానికి పాల్పడే యత్నం చేస్తున్నారని గుర్తించాలన్నారు. ఎవరిమీదైనా అనుమానంగా ఉంటే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. బ్యాంకు ఖాతాలు, క్రెడిట్, డెబిట్ కార్డుల వివరాల విషయంలో గోప్యత పాటించాలన్నారు. అలాగే సర్వే అధికారులకు సహకరించి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేతకాని కులస్తుల సమస్య పరిష్కారం అవుతుంది

మందమర్రిటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మాలల్లోని ఉపకులం నేతానిని నేతకానిగా మారుస్తూ త్వరలోనే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తుందని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేతకానిలకు సంబంధించి నేతానిగా ఉందని, ఇది సున్నితమైన అంశమన్నారు. కొందరు రాజకీయాలు చేస్తున్నారని ఇది సరైంది కాదన్నారు. ఇటీవల నేతకానిల గురించి ముఖ్యమంత్రికి వినతిపత్రం అందించానన్నారు. ముఖ్యమంత్రి అధికారులను ఈ విషయం గురించి పరిశీలించాలని ఆదేశించారన్నారు. త్వరలోనే దీనిపై ఉత్తర్వులు రానున్నాయని తెలిపారు.

ఇక స్థానిక సంస్థల ఎన్నికలు

- బీసీ కులగణన ముగియగానే నోటిఫికేషన్
- జిల్లాకు చేరిన ఎన్నికల సామగ్రి
- పల్లెల్లో మొదలైన ఎన్నికల సందడి
- మూడు దశల్లో నిర్వహణకు సన్నాహాలు
- మున్సిపాలిటీ విలీన గ్రామాల పరిస్థితిపై చర్చ



జిల్లా పరిషత్ కార్యాలయం



జిల్లా పంచాయతీ కార్యాలయానికి చేరుకున్న బ్యాలెట్ బాక్సులు

మంచిర్యాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి నెలకొంది. ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడటంతో అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి జిల్లాలో అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. పంచాయతీల పాలన ఈయేడు జనవరిలో ముగియగా, జిల్లా పరిషత్, మండల పరిషత్‌ల పాలకవర్గాల పదవీకాలం జూలైతో ముగిసింది. దీంతో స్థానిక సంస్థల పాలన ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లింది. గరిష్టంగా మూడు నెలలకు మించి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగరాదనే నిబంధన ఉంది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం ప్రభుత్వానికి అనివార్యమైంది.

రిజర్వేషన్లలో మార్పు

స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పుడున్న రిజర్వేషన్లే అమలు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించినప్పటికీ మార్పులు జరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పంచాయతీ వార్డులు మొదలుకొని జడ్పీ చైర్మన్ స్థానం వరకు క్షేత్రస్థాయిలో రిజర్వేషన్లు మారనున్నాయి. ప్రస్తుతం బీసీ కులగణన సర్వే జరుగుతున్నందున రిజర్వేషన్ల లోనూ మార్పులు చోటు చేసుకోనున్నాయి. బీసీ కుల గణన అనంతరం ఆ సామాజిక వర్గానికి సంబంధించి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాల్సి ఉంటుంది. దీంతో ఇప్పుడున్న స్థానాలకు అదనంగా సీట్ల కేటాయింపు జరుగుతుంది. ఇంతకాలం రిజర్వేషన్లు అనుకూలించక పోటీకి దూరంగా ఉన్న బీసీ సామాజిక వర్గాలకు కులగణన అనంతరం ఆ అవకాశం లభించనుంది. ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించిన అనంతరం సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఆశావహులు ఈసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలనే కుతూహలంతో ఉన్నారు. గత ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్ట సవరణ చేయడం ద్వారా రిజర్వేషన్లు పదేళ్ల వరకు ఉండేలా మార్పులు చేసింది. అయితే బీసీ కుల గణన జరుగుతున్నందున రిజర్వేషన్లలో మార్పు అనివార్యం కానుంది. బీసీ కులగణన ప్రక్రియ ముగియగానే పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయి. ఎన్నికల సామగ్రి సైతం జిల్లాకు చేరింది.

జిల్లాలో 621 గ్రామాలు....

స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో జిల్లాలోని 311 గ్రామ పంచాయతీల పరిధిలోని 621 గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది. జిల్లాలో రెండు పంచాయతీ డివిజన్లలో 16 మండలాలు...

మిగతా 7లో

సర్వేలో తప్పులు లేకుండా చూడాలి : కలెక్టర్



ఎన్యూమరేటర్‌కు సూచనలిస్తున్న కలెక్టర్

శ్రీరాంపూర్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సమగ్ర సర్వేలో తప్పులు లేకుండా చూడాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం 5, 6, 17 వార్డుల్లో పర్యటించి ఎన్యూమరేటర్లకు సూచనలు చేశారు. ప్రజల నుంచి సరైన సమాధానాలు రాబట్టాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్, ఎన్యూమరేటర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

దండేపల్లి (ఆంధ్రజ్యోతి): ప్రతీ కుటుంబం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవసరాలు తెలుసుకోవడానికే ప్రభుత్వం సర్వే చేపడుతోందని అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. నెల్కివెంకటాపూర్‌లో సర్వే తీరును పరిశీలించారు. సర్వే అయిన ప్రతి ఇంటి గోడ, తలుపులపై స్టిక్కర్ అంటించాలన్నారు. సేకరించిన సమాచారం గోప్యంగా ఉంచాలని ఆదేశించారు. తహసీల్దార్ సంధ్యరాణి, ఎంపీడీవో ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ విజయ, కార్యదర్శి సుష్మ పాల్గొన్నారు.

జైపూర్ (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సర్వేను తప్పులు లేకుండా చేపట్టాలని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఖాసీంమహ్మద్, జెడ్పీ సీఈవో, మండల ప్రత్యేకాధికారి గణపతి పేర్కొన్నారు. ఇం దారం, టేకుమట్ల, రామారావుపేట, శెట్‌పల్లి గ్రామాల్లో సర్వేను పరిశీలించారు.ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీ వో శ్రీపతి బాపు, కార్యదర్శులు పాల్గొన్నారు. మండల కేంద్రంలో తహసీల్దార్ వనజారెడ్డి పరిశీలించారు.

తాండూర్ (ఆంధ్రజ్యోతి): సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్‌లు తెలిపారు. అచ్చలాపూర్‌లో సర్వేను పరిశీలించారు. ప్రజలు సర్వే సిబ్బందికి సహకరించాలన్నారు. నాయబ్ తహసీల్దార్ ప్రసాద్, ఎంపీఎస్ఎస్‌వో శ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మందమర్రిటౌన్ (ఆంధ్రజ్యోతి): సర్వేకు అందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. రెండో జోన్ పోస్టాఫీసు ఏరియాలో సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తప్పులు లేకుండా వివరాలను నమోదు చేయాలని పేర్కొన్నారు.

చెన్నూరు (ఆంధ్రజ్యోతి): అంగ్రాజ్‌పల్లి, చెల్లాయిపేట గ్రామాల్లో చేపట్టిన సర్వేను జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్‌రావు తనిఖీ చేశారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజ్మత్ ఆలీ, కార్యదర్శులు యూసుఫ్, రాజేందర్, ఎన్యూమరేటర్లు ఉన్నారు.

కాసిపేట (ఆంధ్రజ్యోతి): సోమగూడెం(కే), దేవాపూర్, ముత్యంపల్లి, చిన్నధర్మారంలో సర్వేను ఎంపీడీవో సత్యనారాయణసింగ్, తహసీల్దార్ భోజన్నలు పరిశీలించారు. ఎంపీవో సప్దర్‌ఆలీ, సూపరింటెండెంట్ లక్ష్మయ్య, సహాయకులు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బెల్లంపల్లి (ఆంధ్రజ్యోతి): కుటుంబ సర్వేకు పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత అన్నారు. పలు వార్డుల్లో సర్వేను పరిశీలించారు. సర్వేపై అపోహలు పెట్టుకోవద్దని, పూర్తి సమాచారం ఇవ్వాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు నెల్లి రమేష్, చంద్రశేఖర్, ఆర్‌పీలు ఉన్నారు.

మందమర్రిరూరల్ (ఆంధ్రజ్యోతి): చిర్రకుంటలో అధికారులు సర్వేను పరిశీలించారు. కాంగ్రెస్ నాయకులు గందె రాంచందర్, ఒడ్నాల కొమురయ్యలు సర్వేను పరిశీలించారు.

మంచిర్యాల అర్బన్, (ఆంధ్రజ్యోతి): ఇంటింటి కుటుంబ సర్వే మంచిర్యాల మున్సిపాలిటీలో ప్రారంభమైంది. 36 వార్డుల్లో 29,723 కుటుంబాలు ఉండగా 223 మంది సిబ్బంది సర్వేలో పాల్గొంటున్నారు.



వెంకటాపూర్ సర్వేలో పాల్గొన్న అదనపు కలెక్టర్

జన్నారం (ఆంధ్రజ్యోతి): పొనకల్‌లో జరుగుతున్న కుల గణన సర్వేను ఎంపీడీవో శశికళ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కుటుంబీకుల వివరాలను పూర్తి స్థాయిలో నమోదు చేయాలని సూచించారు. ఈవో రాహుల్, సిబ్బంది ఉన్నారు.

భీమారం(ఆంధ్రజ్యోతి): కుటుంబ సర్వేను ఎంపీడీవో సదానందం పరిశీలించి ఎన్యూమరేటర్లకు సూచనలు చేశారు. కార్యదర్శి కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఉపముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సర్వేలో అన్ని కుటుంబ సభ్యుల వివరాలను సేకరించాలన్నారు. వెనకబడిన తరగతులు, షెడ్యూల్డు తెగలు, ఇతర బలహీన వర్గాల అభ్యున్నతికి సరైన నిర్ణయాలు తీసుకుని అవసరమైన ప్రణాళికలు అమలు చేసేందుకు సర్వే చేపడుతున్నామన్నారు. అధికారులు ఎన్యూమరేటర్లకు అవసరమైన సామగ్రిని అందించాలన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సర్వేను విజయవంతం చేసే దిశగా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రతీ ఇంటి నుంచి కుటుంబీకుల వివరాలను సేకరించాలన్నారు. సర్వే ఫారాల కొరత లేకుండా చూడాలన్నారు. జెడ్పీసీఈవో గణపతి, డీపీవో వెంకటేశ్వర్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

సింగరేణి పరిరక్షణకు పోరాటాలు



మహాసభ ముగింపులో నేతల అభివాదం

మందమర్రిటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణకే తలమానికమైన సింగరేణి పరిరక్షణకు సమరశీల పోరాటాలు చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. శనివారం సీపీఎం పార్టీ మూడవ మహాసభల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ప్రభుత్వ రంగ పరిశ్రమలు లేకుండా చేయాలని మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. ఇందులో భాగంగా ఆదాని, అంబానీలకు బొగ్గు బ్లాకులను కట్టబెట్టేందుకు చూస్తుందన్నారు. ఇప్పటికే లాభాల్లో ఉన్న అనేక పరిశ్రమలను ఆదానికి కట్టబెట్టారన్నారు. సింగరేణిలో రానున్న రోజుల్లో భూగర్భ గనులు మూత పడనున్నాయని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని నూతన గనులను ఏర్పాటు చేయాలన్నారు. సింగరేణిలోని 4 బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలన్నారు. సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. హైపవర్ కమిటీ వేతనాలను అమలు చేయాలన్నారు. సీపీఎం నాయకులు పాలడుగు భాస్కర్, సంకె రవి, పైళ్ల ఆశయ్య పాల్గొన్నారు.

జిల్లా కమిటీ ఎన్నిక : సీపీఎం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా సంకె రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా గోమాస ప్రకాష్, కనికరపు అశోక్, ఎర్మ పున్నం, జిల్లా కమటీ సభ్యులుగా బోడెంకి చందు, గుమాస అశోక్, దాగం రాజారాం, రంజిత్‌కుమార్, శ్రీనివాస్, శ్యామల, ఉమారాణి, ప్రేమ్‌కుమార్, లింగన్నలను ఎన్నుకున్నారు.

పెద్దధర్మారం శివారులో పులి సంచారం

- భయాందోళనలో స్థానికులు

కాసిపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కాసిపేట మండలంలోని పెద్ద ధర్మారం సమీపంలోకి శనివారం తెల్లవారుజామున పెద్దపులి వచ్చింది. దీంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. గత ఆదివారం మామిడిగూడెం పంచాయతీ గోండుగూడకు చెందిన చిత్రు అనే గిరిజన రైతుకు చెందిన ఆవుల మందపై పెద్దపులి దాడి చేసి మూడు ఆవులను చంపిన విషయం తెలిసిందే. సురక్షిత ఆవాసం కోసం వెతుకుతూ మూడు రోజుల క్రితం పెద్దపల్లి కవ్వాల అభయా రణ్యంలోకి వెళ్లినట్లు సమాచారం. శనివారం తెల్లవారు జామున పెద్ద ధర్మారం గ్రామానికి అతి సమీపంలోని రహదారిపై పులి అడుగులు కనిపించడంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. పంటచేన్లలో కాపలా ఉన్న కొందరికి పెద్దపులి అరుపులు వినిపించినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా పత్తి పంట చేతికి రావడంతో పులి భయంతో పత్తి తీసేం దుకు కూలీలు రావడం లేదని రైతులు వాపోతున్నారు. ముత్యంపల్లి అటవీ సెక్షన్ పరిధిలోని పెద్దపులి రావడంతో అటవీ శాఖ సిబ్బందిని అధికారులు అప్రమత్తం చేశారు. వ్యవసాయ కూలీలు, పశువుల కాపర్లు అడవీ ప్రాంతంలోకి వెళ్లవద్దని సూచించారు. పులిని గుర్తిం చేందుకు ట్రాకింగ్ కెమెరాలను సైతం ఏర్పాటు చేసినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. పులికి ఎలాంటి హానీ తలపెట్టకుండా ఉండేందుకు స్థానిక అటవీ శివారు గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.





పెద్ద ధర్మారం శివారులో పెద్దపులి అడుగులను పరిశీలిస్తున్న స్థానికులు , దారిపై పులి పాదముద్ర

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాల అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎక్కడ ఏ చిన్న సంఘటన జరిగినా బీఆర్ఎస్, బీజేపీ నాయకులు రాజకీయం చేస్తున్నారని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని సాయికుంటలో గల బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు ఇటీవల అస్వస్థతకు గురి కాగా శనివారం ఆయన కలెక్టర్ కుమార్‌దీపక్‌తో కలిసి సందర్శించారు. అస్వస్థతకు గురైన విద్యార్థినులను పరామర్శించి వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నేతలు పిల్లలతో రాజకీయం చేయడాన్ని మానుకోవాలన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటేనే సంక్షేమానికి మారుపేరని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వ హయాంలో 6 నెలలుగా పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులను క్లియర్ చేశామన్నారు. నాలుగేళ్ళుగా పెండింగ్‌లో ఉన్న అద్దె భవనాల బిల్లులను క్లియర్ చేశామని, అలాగే డైట్ చార్జీలను 40శాతం, కాస్మోటిక్ చార్జీలను పెంచిన ఘనత మా ప్రభుత్వానిదేనని అన్నారు. ఆయన వెంట అధికారులు, నాయకులు ఉన్నారు.

స్టేడియం ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలపరిశీలనలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మంచిర్యాల అర్బన్, నవంబర్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సాయికుంటలో స్పోర్ట్స్ సేడియం ఏర్పాటుకు 12 ఎకరాల స్థలాన్ని శనివారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే స్థలానికి సంబంధించిన హద్దులను పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. నస్పూర్ మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, పబ్లిక్ హెల్త్ డీఈ మధూకర్, నాయకులు తూముల నరేష్, పూదరి తిరుపతి పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు



ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయ సేవ అధికార సంస్థ సభ్యులు, విద్యార్థులు

గర్మిళ్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పోస్టుమెట్రిక్ హాస్టల్‌లో న్యాయ విజ్ఞానసదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్‌జడ్జి అర్పిత మారంరెడ్డి విద్యార్థులకు ర్యాగింగ్, బాలకార్మికుల నిర్మూలన, నిర్బంధ విద్యాహక్కు, చట్టాల గురించి వివరించారు. రాజీమార్గమే రాజమార్గమని సూచించారు. ఎవరికైనా న్యాయసలహాలు కావాలంటే టోల్‌ఫ్రీ నెంబర్ 15100కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని తెలిపారు. అనంతరం హాస్టల్ నుంచి వెంకటేశ్వర థియేటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. హాస్టల్ సిబ్బంది, న్యాయ సేవాసంస్థ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల రాస్తారోకో



ఐబీ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గర్మిళ్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని శనివారం మంచిర్యాలలోని ఐబీ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. దివాకర్‌రావు మాట్లాడుతూ ప్రాణాలు పణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. వెంటనే కేసీఆర్‌కు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకులు గాదె సత్యం, అంకం నరేష్, తాజుద్దీన్, తోట తిరుపతి, ఎర్రం తిరుపతి, రవీందర్‌రెడ్డి, రవీందర్, శ్రీనివాస్, తిరుపతి, మహ్మద్ రఫీ, శంకర్, ప్రదీప్‌క్రాంతి, భానుచందర్, షారుక్, వేణుగోపాల్, అంకుస్ పాల్గొన్నారు.

వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కూల్చివేతలు



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కూల్చివేతలు చేపడుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో సంస్థగత ఎన్నికల వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యాపారస్తులను నెల రోజులుగా ఎమ్మెల్యే భయభ్రాంతులకు గురి చేస్తూ రోడ్ల వెడల్పు పేరుతో వారి ఆస్తులను ధ్వంసం చేస్తున్నారన్నారు. అక్రమ కూల్చివేతలు ఆపాలని వ్యాపారస్తులు హైకోర్టును ఆశ్రయిస్తే తాము పట్టణంలో ఎలాంటి కూల్చివేతలు జరపడం లేదని హైకోర్టులో వాదించి ఇక్కడ కూల్చివేతలు చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. హామీలు నెరవేర్చే వరకు బీజేపీ పోరాటాలు చేస్తుందన్నారు. నాయకులు పురుషోత్తం,వెంకటేశ్వర్‌గౌడ్, పోశం, శ్రీదేవి, వెంకటకృష్ణ, కృష్ణమూర్తి, శ్రీనివాస్, రమేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమణలను తొలగిస్తాం... రోడ్లను విస్తరిస్తాం...

మంచిర్యాల అర్బన్, నవంబర్ 9 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణ సుందరీకరణలో వెనుకడుగు వేసేది లేదని, మార్కెట్ ప్రాంతంలో నిర్దేశించిన మార్కింగ్ ప్రకారంగానే ఆక్రమణలను తొలగించి రోడ్లను విస్తరిస్తామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. శనివారం సాయంత్రం మున్సిపల్ అధికారులతో కలిసి మార్కెట్‌ను సందర్శించి ఆక్రమణల తొలగింపు పనులను పరిశీలించారు. పట్టణ అభివృద్ధికి రోడ్ల వెడల్పు అవసరమని, భవిష్యత్తులో ఇబ్బందులు కలగవద్దనే ఉద్దేశ్యంతోనే ఆక్రమణల తొలగింపుతోపాటు రోడ్ల వెడల్పు చేపడుతున్నామన్నారు. వ్యాపారస్తులంతా స్వచ్ఛందంగా సహకరిస్తున్నారని, ఎవరో ఒకరిద్దరు అభ్యంతరాలు వ్యక్తం చేసినంత మాత్రాన పనులు ఆపే ప్రసక్తే లేదన్నారు. మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో మంటలు



డంపింగ్ యార్డులో మంటలను పరిశీలిస్తున్న చైర్మన్, కమిషనర్

నస్పూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ మున్సిపల్ చెత్త డంపింగ్ యార్డు శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాప్తి చెందాయి. ఆర్‌కే-5 కాలనీ, న్యూ నాగార్జున కాలనీలకు దట్టమైన పొగ కమ్ముకుంది. ప్రజలు ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వచ్చింది. మున్సిపల్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో చైర్మన్ సుర్మిళ్ళ వేణు, కమిషనర్ చిట్యాల సతీష్‌లు పరిశీలించారు. ఫైర్ ఇంజన్ మంటలను అదుపులోకి తెస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

మంచిర్యాల అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో హమాలీవాడ గేటు వద్ద శనివారం సింగరేణి ప్యాసింజర్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ట్రాక్ వెంబడి నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి రైలు ఢీకొట్టగా తలకు తీవ్ర గాయమై ట్రాక్ పక్కనే పడిపోయాడని, డ్యూటీలో ఉన్న కీ-మెన్ గమనించి 108కు సమాచారం అందించాడని జీఆర్‌పీ ఎస్సై మహేందర్ తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. మృతుడి వయస్సు 40-45 మధ్య ఉంటుందని, ఎత్తు 5.6, చామన ఛాయ, కోల ముఖం, యాష్ కలర్ ప్యాంటు, గీతల డబ్బాలతో కల్గిన ఫుల్ షర్ట్ ధరించి ఉన్నాడని తెలిపారు. తెలిసిన వారు 8712658596, 9701112343 నెంబర్లను సంప్రదించాలని ఎస్సై తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం

దహెగాం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మొట్లగూడ గ్రామానికి చెందిన ఎనగందుల పోశయ్య(80) అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. గత నెల 10న ఇంటి నుంచి వెళ్లి ఇప్పటివరకు తిరిగి రాలేదన్నారు. పోశయ్యకు మతిస్థిమితం సరిగ్గా లేదన్నారు. ఈ మేరకు కటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.



పోశయ్య

దేశీదారు పట్టివేత



పట్టుబడిన దేశీదారు మద్యంతో సీఐ, ఎస్సైలు

కౌటాల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నుంచి అక్రమంగా తరలిస్తున్న దేశీదారును శనివారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు సీఐ రమేష్ తెలిపారు. చింతల మానేపల్లి మండలం గూడెం గ్రామానికి చెందిన పర్వతాల ప్రవీణ్, ఆగాడి కొడయ్య, కౌటాల మండలం తుమ్మిడిహెట్టికి చెందిన ఓడిల ప్రకాష్ మహారాష్ట్ర చంద్రాపూర్ జిల్లా నుంచి గడ్చిరోలి జిల్లాకు తరలించేందుకు ఆటోలో ఉన్న 20కార్టన్ల దేశీదారును పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన దేశీదారు విలువ రూ.1.8లక్షలు ఉంటుందన్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి ఆటోను, మద్యంను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో ఎస్సై మధుకర్, హెడ్ కానిస్టేబుల్ మహమూద్, రాకేష్ పాల్గొన్నారన్నారు.

కొడుకుపై కోపం తండ్రి హత్య

చెన్నూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ముత్తరావుపల్లి గ్రామానికి చెందిన పైడిపల్లి మల్లయ్య (50)ను అదే గ్రామానికి చెందిన జాడి భూమయ్య హతమార్చాడు. పట్టణ సీఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం మల్లయ్యకు భార్య మల్లక్కతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు పైడిపల్లి రాజశేఖర్ జాడి భూమయ్య భార్య సౌందర్య ఒకరిని ఒకరు ఇష్టపడి ఏడు నెలల క్రితం వెళ్లిపోయారు. దీంతో భూమయ్య పోలీస్‌స్టేషన్‌లో భార్య కనబడడం లేదని ఫిర్యాదుచేశాడు. పోలీసులు వారిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా వినకుండ వారు వేరే ప్రాంతానికి వెళ్లి కాపురం ఉంటున్నారు. ఈ విషయమై భూమయ్య రాజశేఖర్ కుటుంబంపై కక్ష పెంచుకున్నాడు. రాజశేఖర్ తండ్రి మల్లయ్య శనివారం బహిర్భూమికని గ్రామ సమీపంలోని వాగు వద్దకు వెళ్లగా అక్కడే వేచి ఉన్న భూమయ్య మల్లయ్యను గొడ్డలితో నరికి చంపాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి కుమారుడు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఓటరు నమోదు కార్యక్రమం

తాండూర్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : మండలంలో శనివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. గోపాల్ నగర్ పోలింగ్ కేంద్రంలో జరుగుతున్న ఓటరు నమోదును తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్‌పఠాన్, ఎంపీడీవో శ్రీనివాస్‌లు పరిశీ లించారు. 18 సంవత్సరాలు నిండిన వారం దరి వివరాలను ఓటరు జాబితాలో నమో దు చేయాలని బీఎల్‌వోలకు సూచించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ ప్రసాద్ , సిబ్బంది పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం
'టోంకిని' సిద్ధి హనుమాన్ ఆలయం

- ఈనెల 12న 23వ మహాపాదయాత్ర



ఆలయంలోని హనుమాన్ విగ్రహం



టోంకినిలోని సిద్ధిహనుమాన్ ఆలయం

సిర్పూర్(టి), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కాగజ్ నగర్ పట్టణం నుంచి సిర్పూర్(టి)మండలం టోంకిని సిద్ధిహనుమాన్ ఆలయం వరకు భక్తులు ఈనెల 12న 23వ మహాపాదయాత్ర చేపట్టనున్నారు. కార్తీకమాసంలో ఆలయంలో ప్రతిసంవత్సరం జాతరతోపాటు కాగజ్‌నగర్ పట్టణంనుంచి మహాపాదయాత్ర నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. ఇందుకుగాను ఆలయకమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఆలయఅర్చకుడు, కమిటీసభ్యుడు మారుతి తెలిపారు.

కోరిన కోర్కెలు తీరుతాయన్న భక్తుల అపార నమ్మకం..


మండలంలోని టోంకిని గ్రామంలోని శ్రీసిద్ధి హనుమాన్ ఆలయంలోని స్వామివారిని దర్శించుకుని ముడుపులు కడితే కోరిన కోరికలు తీరుతాయని భక్తుల అపారనమ్మకం.

దీంతో భక్తులు ప్రతి యేటా ఆలయానికి పాదయాత్రగా వచ్చి తమ మొక్కులు చెల్లించుకుంటారు. జిల్లాలోని మండలా లతోపాటు మహా రాష్ట్రలోని పోడ్సా, అన్నూర్, అంతర్‌గాం, గోండ్ పిప్రి గ్రామాల నుంచి అనేక మంది భక్తులు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. పాదయాత్రగా వచ్చే భక్తులకు ఆలయంలో అన్న దానం నిర్వహిస్తారు. దీంతో ఆరోజు మండల కేంద్రంలో పండుగ వాతా వరణం నెలకొంటుంది.

దారిపొడవున భక్తులకు సేవా కార్యక్రమాలు

మహాపాదయాత్రలో పాల్గొనే భక్తులకు ఆలయ కమిటీతోపాటు సిర్పూర్(టి), కాగజ్‌నగర్, కౌటాల, తదితర ప్రాంతాల్లోని వ్యాపారస్తులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో తాగునీరు, పాలు, పండ్లు, ఫలహారాల పంపిణీకి రహదారి మధ్యలో ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని వేంపల్లి గ్రామం నుంచి వేంపల్లి రైల్వేగేటు, అటవీ ప్రాంతంలోని భీమన్నఆలయం, పెద్దబండ గ్రామసమీపంలో, మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం, పెట్రోల్ పంపు, బెస్తకాలనీ, మేషన్‌కాలనీ, ఎస్సీ కాలనీ, బస్టాండు, డౌనల్ ఏరియా ప్రాంతాల్లో భక్తుల సౌకర్యార్థం పాలు, పండ్లు, తాగునీరు, ఫలహారం పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



కుంగిపోతున్న పెద్దరాయి

రెబ్బెన, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం గంగాపూర్ శివారులోని శ్రీబాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద మెట్ల మార్గంలో ప్రమాదం పొంచి ఉంది. గుట్టను ఆనుకొని ఉన్న పెద్దరాయి మెట్ల వైపు కుంగిపోతుండటంతో భక్తులు భయపడుతున్నారు. వర్షం కురిసినప్పుడు ఎప్పుడు ఏం జరుగుతోందో తెలియక హైరానా పడుతున్నారు. ఇప్పటివరకు రెండు ఫీట్ల వరకు కుంగిపోయినట్లు భక్తులు పేర్కొంటున్నారు. శని, సోమవారాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని భక్తులు కోరుతున్నారు.

టాస్క్‌ఫోర్సు అధికారుల తనిఖీలు

కాగజ్‌నగర్ టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో శనివారం సాయంత్రం ఎక్సైజ్ స్టేట్‌టాస్క్‌ఫోర్సు అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మద్యంషాపుల్లో తనిఖీలు చేపట్టారు. అలాగే రైల్వేస్టేషన్‌లో పలు రైళ్లను కూడా తనిఖీచేశారు. ఈ తనిఖీల్లో ఎస్సైబాలరాజు, సిబ్బంది ఉన్నారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి



చింతలమానేపల్లి:ఓటరు నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్ మునావర్ షరీఫ్

వాంకిడి/చింతలమానేపల్లి/సిర్పూర్(టి), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్డీవో లోకేశ్వర్‌రావు, తహసీల్దార్ మునావర్ షరీఫ్, శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం వారు వాంకిడి, చింతలమానేపల్లి మండలాల్లోని గ్రామాల పోలింగ్ స్టేషన్లను సందర్శించి బీఎల్‌వోలు చేస్తున్న ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే బీఎల్‌వోలకు తెలియచేయాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సవరణలు, మరణించిన వారి వివరాలను జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా బూత్‌స్థాయి అధికారులకు ఓటరు నమోదు, సవరణలు, వివరాల తొలగింపుపై పలు సూచనలు చేశారు.

కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి



వాంకిడిలో, చింతమలానేపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో, ఎంపీడీవో

వాంకిడి/దహెగాం/బెజ్జూరు/చింతలమానేపల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీవో లోకేశ్వర్‌రావు, మండల ప్రత్యేకాధికారు సజీవన్, నదీం పేర్కొన్నారు. శనివారం మండలాల్లోని గ్రామాల్లో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లు ప్రతిఇంటికి వెళ్లి కుటుంబసభ్యుల వ్యక్తిగత, కుటుంబ వివరాలు సేకరించాలన్నారు. వివరాల సేకరణలో నైతికప్రమాణాలు పాటించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజ్ అలీ, గిర్దావార్ మాజీద్, పాల్గొన్నారు.

ప్రారంభమైన సర్వే

సిర్పూర్(టి): మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఇంటింటికి ఎన్యుమరేటర్లు వెళ్లి ప్రజల నుంచి వివరాలు సేకరించారు. మండలంలో 72బ్లాక్‌లు ఉండగా 66మంది ఎన్యుమరేటర్లు, ఏడుగురు సూపర్‌వైజర్లు సర్వే చేపట్టారు. మూడు రోజులుగా 9200గృహాలకు స్టిక్కర్లు అంటించగా కుటుంబ సభ్యుల వివరాలను సేకరిస్తున్నారు. సర్వేను తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ పరిశీలించారు.

బాలలు హక్కులను తెలుసుకోవాలి



మాట్లాడుతున్న కౌన్సిలర్ చంద్రశేఖర్

ఆసిఫాబాద్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): బాలల హక్కులను తెలుసుకొని వాటిపై అవగాహన కలిగి ఉండాలని డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ కౌన్సిలర్ చంద్రశేఖర్ అన్నారు. బాలలహక్కుల వారోత్సవాల భాగంగా శనివారం పట్టణంలోని జడ్పీబాలికల, బాబాపూర్‌లోని మహత్మ జ్యోతిబాపూలే గురుకుల బాలికలపాఠశాలలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా బాలలహక్కుల రక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం వ్యాస రచన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవీ భవన్‌లో శనివారం మాతృశ్రీ జూనియర్, డిగ్రీకళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి కళశాలల ప్రిన్సిపాళ్లు బాలాజీ, ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను నేరవేర్చి ఉన్నత శిఖరాలకు చేరుకొవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో కళశాల డైరెక్టర్లు శైలేందర్, లింగమూర్తి, పవన్, లెక్చరర్లు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు సకాలంలో వేయించాలి



చిన్నారులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

వాంకిడి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, చిన్నపిల్లలకు క్రమం తప్పకుండా వ్యాధినిరోధక టీకాలు వేయిం చాలని హెచ్ఈవో రవిదాస్ అన్నారు. శనివారం గోయగాం పంచాయతీలోని రాజులుగూడలో వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సునంద, హెచ్ఏ భగవాన్‌దాస్, ఆశాకార్యకర్త పార్వతి పాల్గొన్నారు.

మిషన్ భగీరథ ద్వారా మురికినీరు



కుళాయి ద్వారా వచ్చిన మురికి నీరు

వాంకిడి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఇందిరానగర్‌కాలనీలో శనివారం మిషన్‌భగీరథ ద్వారా మురికిరావడంతో ప్రజలు తీవ్రఇబ్బందులు పడ్డారు. ఇందిరానగర్ కాలనీలో మురికి కాలువల్లో భగీరథ పైపు లైన్ ఏర్పాటుచేయడం వల్ల లీకేజీలు ఏర్పడి కొన్ని ప్రాంతాలకు కుళాయిలద్వారా మురికినీరు వచ్చినట్లు కాలనీ వాసులు పేర్కొన్నారు. నీరుదుర్వాసన రావడంతో కాలనీ వాసులు పంచాయతీకార్యదర్శికి సమాచారం అందించారు. అయినప్పటికీ సిబ్బందివచ్చి పరిశీలించలేదని వాపోయారు.



అమరుల స్ఫూర్తితో ఉద్యమించాలి: ఐఎఫ్‌టీయూ

శ్రీరాంపూర్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): భారత విప్లవోద్యమ అమరులస్ఫూర్తితో ఉద్యమించాలని సింగరేణికాలరీస్ కాంట్రాక్టువర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్రఅధ్యక్షుడు డి బ్రహ్మానందం కోరారు. శ్రీరాంపూర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో శనివారం కాంట్రాక్టు కార్మికుల సమావేశం నిర్వహించగా, ఆయన మాట్లాడారు. విప్లవరథసారధులు తరిమెల నాగిరెడ్డి, చంద్రపుల్లారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, చారు మజుందార్, రామ నర్సయ్య తదితరులు పేదప్రజల కోసం నిరంతరం ఉద్యమాలు నడిపారని తెలిపారు.

వారిని స్మరించుకుంటూ, వారు చూపిన మార్గంలో పయణించేందుకు సిద్ధం కావాలని సూచించారు. మంచిర్యాలలోని మార్క్స్‌భవన్‌లో ఆదివారం నిర్వహించే అమరవీరుల సంస్మరణ సభను విజయవంతం చేయాలని ఆయన కార్మికులను కోరారు.

కార్యక్రమంలో అప్పారావు, శంకర్, రాజయ్య, బాపు, తిరుపతి, కనకయ్య, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

రక్షణలో ప్రథమ స్థానంలో నిలవాలి

రెబ్బెన, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలో ఉద్యోగులు రక్షణతో కూడిన విధులు నిర్వహించి ప్రథమ స్థానంలో నిలవాలని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. శనివారం జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో అన్ని విభాగాల అధిపతులతో నిర్వహించిన 55వ వార్షిక రక్షణ పక్షోత్సవాల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గనుల్లో ఉద్యోగులు రక్షణకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఉద్యోగులు ఇంటి నుంచి రక్షణ్మాతక పరికరాలు ధరించాలన్నారు. ఈనెల 25 నుంచి ప్రారంభం కానున్న వార్షిక రక్షణ పక్షోత్సవాల నిర్వహణకు ముమ్మర ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో కైరిగూడ పీవో ఎం నరేందర్, ఏరియా ఇంజనీర్ భీంరావు జాడే, ఏరియా సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, పర్సనల్ మేనేజర్ ఆర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన బొగ్గు ఉత్పత్తిని సాధించాలి

శ్రీరాంపూర్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు మెరుగైన బొగ్గు ఉత్పత్తిని సాధించాలని ఆర్కే5,6 గ్రూపు ఏజెంట్ శ్రీధర్, ఆర్కే5 మేనేజర్ సుధీర్‌కుమార్‌ఝూ అన్నారు. ఆర్కే5 గనిపై శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నోఏళ్లుగా ఉత్పత్తి, రక్షణలో ఆర్కే5గని ముందంజలో ఉందని తెలిపారు. అదే ఒరవడిని కొనసాగించాలని కోరారు. ఉత్పత్తిఎక్కువగా వస్తే ఇన్సెంటివ్ పొంద వచ్చని అన్నారు. అనంతరం అత్యధిక ఉత్పత్తిసాధించిన బీ రిలే ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. అనంతరం గనిమేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన సుధీర్ కుమార్ ఝూను ఉద్యోగులు, అధికారులు ఘనంగా సన్మానించారు. తన ఉద్యోగ ప్రయాణం ఇదేగనిలో ప్రారంభమైందని ఆయన గుర్తుచేసుకున్నారు. అన్ని బాధ్యతలు చేపట్టి, ఇతరచోట్ల పనిచేసి తిరిగి ఇదేగనికి రావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో రక్షణాధికారి రాందాస్, సంక్షేమాధికారి రణదీప్‌గౌడ్, పిట్‌కార్యదర్శి నర్సింగరావు, మైనింగ్‌అధికారులు,సూపర్‌వైజర్లు,యూనియన్లనాయకులు పాల్గొన్నారు.

అధికారికి సన్మానం

మందమర్రిటౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆర్కే ఓసీపీ ప్రాజెక్టు అధికారి గోవిందరావు బదిలీపై వెళ్తున్న సందర్భంగా శనివారం జీఎం కార్యాలయంలో మందమర్రి ఇన్‌చార్జీ జీఎం రాందాస్ ఆయనను ఘనంగా సన్మానించారు. ఇన్‌చార్జీ జీఎం మాట్లాడుతూ మందమర్రి ఏరియా అభివృద్ధికి గోవిందరావు కృషి చేశారని తెలిపారు. బదిలీపై వెళ్తున్న ఎల్లందు ఏరియాలో కూడా మంచిపేరు సంపాదించుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు విజయ్ ప్రసాద్, శ్యాంసుందర్, డీఎంలు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

ఇక స్థానిక సంస్థల ఎన్నికలు

5వ పేజీ తరువాయి..

ఉండగా, వాటి పరిధిలో మొత్తం 2730 వార్డులు ఉన్నాయి. మొత్తం ఓటర్లు 3,78,912 మంది ఉండగా, ఎంపీటీసీ స్థానాలు 130, జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు 16 ఉన్నాయి. 2730 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో 2018 పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం గత పంచాయతీ ఎన్నికలు జరిగాయి. 2019లో మూడు విడతల్లో ఎన్నికలు జరుగగా, 2024 జనవరి 31తో గ్రామ పంచాయతీల పాలకవర్గం పదవీ కాలం ముగిసింది. ఈ క్రమంలో ముందుగా పంచాయతీ ఎన్నికలకు అధికారులకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఓటర్ల జాబితాను అధికారులు ఇప్పటికే సిద్ధం చేశారు.

ఆ గ్రామాల్లో ఎన్నికలు నిర్వహిస్తారా...?

మున్సిపాలిటీల్లో విలీన గ్రామాల పరిస్థితిపై ప్రస్తుతం జోరుగా చర్చ కొనసాగుతోంది. మంచిర్యాల మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా ఏర్పడుతుందనే ప్రచారం జరుగుతుండటంతో ఏయే గ్రామాలను విలీనం చేస్తారనే చర్చ సాగుతోంది. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పడితే సమీప మున్సిపాలిటీ నస్పూర్‌ను విలీనం చేయనున్నారు. ఆయా మున్సిపాలిటీలతోపాటు పరిసర గ్రామాలు కూడా కార్పొరేషన్‌లో విలీనమయ్యే అవకాశం ఉంది. కార్పొరేషన్ ఏర్పాటుకు కావలసిన కనీస జనాభాను దృష్టిలో ఉంచుకుని కొన్ని గ్రామాలను విలీనం చేయక తప్పని పరిస్థితి నెలకొంది. ఇందులో భాగంగా హాజీపూర్ మండలంలోని వేంపల్లి, ముల్కల్ల, గుడిపేట గ్రామాల విలీనం తప్పదనే సంకేతాలు వెలువడుతున్నాయి. ఇదే జరిగితే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆయా గ్రామాల్లో ఎలక్షన్లు నిర్వహిస్తారా లేదా అనే సందేహాలు ప్రజల్లో నెలకొన్నాయి.

పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ 1, స్టెనో టైపిస్టు 1, రికార్డు అసిస్టెంట్ 1 పోస్టులను భర్తీ చేస్తామన్నారు. ఈ నెల 22వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, న్యాయ సేవా సదన్, జిల్లా న్యాయస్థానం, మంచిర్యాలకు చేరే విధంగా రిజిస్టర్ పోస్టు, కొరియర్ ద్వారా మాత్రమే పంపించాలని పేర్కొన్నారు. డిసెంబరు 8న జిల్లా కేంద్రంలోని న్యాయస్థాన భవనంలో రాత పరీక్ష జరుగుతుందన్నారు.

పాత పింఛన్ సాధనే ధ్యేయం

జన్నారం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పాత పింఛన్ సాధనే ధ్యేయంగా పనిచేస్తానని సీపీఎస్ ఉపాధ్యాయ అధ్యాపక ఎమ్మెల్సీ అభ్యర్థి కృష్ణారావు అన్నారు. శనివారం మండలంలోని కవ్వాల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. సీపీఎస్ విధానం అనేది ఉద్యోగుల భవిష్యత్‌ను అంధకారం చేస్తుందన్నారు. శ్రీకాంత్, రమేష్‌చందర్, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు అప్రెంటీస్‌షిప్ మేళా

మందమర్రిరూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఐటీఐ కళాశాలలో ఈ నెల 11న అప్రెంటీస్‌షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దేవానంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో బయోడేటా, బ్యాంకు ఖాతా, రెండు ఫోటోలు తీసుకుని రావాలని సూచించారు.

నేడు రక్తదాన శిబిరం

శ్రీరాంపూర్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్‌లోని కొత్తరోడ్డు భక్తాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 9 గంటలకు రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు వెల్మరెడ్డి శివారెడ్డి, కొండా శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక యువకులు, దీక్షాపరులు విజయవంతం చేయాలని కోరారు.

పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫీజు చెల్లించండి

మంచిర్యాల అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మార్చిలో జరగనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు (ఎస్ఎస్‌సీ, ఓఎస్ఎస్‌సీ, ఎస్ఎస్‌సీ ఒకేషనల్) రాసే విద్యార్థులు ఫీజులు చెల్లించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని సబ్జెక్టులకు రూ.125, మూడు సబ్జెక్టులకు రూ.110, ఒకేషనల్ విద్యార్థులు రూ.185 చెల్లించాలన్నారు. ఈనెల 18వ తేదీ వరకు అపరాధ రుసుం లేకుండా చెల్లించవచ్చని తెలిపారు. డిసెంబర్ 2వరకు రూ.50, 12వ తేదీ వరకు రూ.200, 21వ తేదీ వరకు రూ.500 అపరాధ రుసుంతో చెల్లించవచ్చని ఆయన తెలిపారు.

పరామర్శ

మందమర్రిరూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఫీల్డ్ అసిస్టెంట్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఈద లింగయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా శనివారం మాజీ విప్ నల్లాల ఓదెలు పొన్నారంలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులు గందె రాంచందర్, ఒడ్నాల కొమురయ్య తదితరులు ఉన్నారు.

ఉపాధి చూపుతున్న విస్తరాకులు

- అడవిని నమ్ముకున్న ఆదివాసీలకు బాసటగా మోదుగ చెట్లు
- మహారాష్ట్ర, ఇతర ప్రాంతాలకు సరఫరా



విస్తరాకులు తయారు చేస్తున్న నిర్వాహకురాలు శ్రీలత



పరిశ్రమలో తయారు చేసిన మోదుగ విస్తరాకులు

భీమారం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : భీమారం గ్రామపంచాయతీ పరిధిలోని మాదన్న గూడంలో ఆది వాసీ గిరిజన గూడాల్లో మోదుగాకు పరిశ్రమ ఏర్పాటు చేసింది ఓ మహిళ... 2018లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నాలుగు మిషన్‌లతో విస్తరాకులు తయారు చేసే పరిశ్రమ నెలకొల్పింది. నష్టాలు వచ్చినా అధైర్యపడకుండా శ్రీరామ మహిళ సంఘం ద్వారా రూ.2 లక్షల రుణం తీసుకుని విస్తారాకుల పరిశ్రమను ఏర్పాటు చేసింది పల్ల శ్రీలత. భీమారం మండలంలోని పలు గ్రామాలను ఆనుకుని ఉన్న అడవుల నుంచి మోదుగాకులను కూలీల ద్వారా సేకరించి వాటిని ఆరబెట్టి విస్తరాకులు తయారు చేసి విక్రయించేది.

● ఇతర రాష్ట్రాలకు ఎగుమతి

విస్తరాలకు తయారుచేసి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తోపాటు మహారాష్ట్రకు ఎగుమతి చేస్తోంది. ఇటీవల ప్లాస్టిక్ ప్లేట్ల వినియోగం పెరిగింది. అయినప్పటికీ మోదుగాకు విస్తరాకులను పెళ్లిళ్లకు, పేరంటాలకు, ఇతర శుభాకార్యాలకు సరఫరా చేస్తున్నారు. అలాగే దీక్షలు స్వీకరించిన భక్తులు విస్తరాకులను కొనుగోలు చేస్తున్నారు. మోదుగాకు విస్తరాలను మూడు సైజుల్లో తయారు చేస్తున్నారు. టేబుల్ ప్లేట్‌లు, టిఫిన్ ప్లేట్లు, బఫేప్లేట్‌లు, దొప్పలు తయారు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పరిశ్రమలో ఐదుగురు మహిళలు ఉపాధి పొందుతున్నారు. శుభాకార్యాల సమయంలో గిరాకీ ఎక్కువగా ఉంటుందని పరిశ్రమ నిర్వహకురాలు పేర్కొంటుంది.



విస్తరాకులను కుడుతున్న మహిళలు



ఆదివాసీ విస్తరాకుల తయారీ కేంద్రం

ఉపాధి కల్పిస్తున్నా..

విస్తరాకుల తయారు కేంద్రాన్ని ఏర్పాటు చేసి పలువురు మహిళలకు ఉపాధి కల్పిస్తున్నా. ప్రస్తుతం పరిశ్రమ బాగా నడుస్తుంది. పరిశ్రమలో పనిచేసే మహిళలు రోజుకు రూ.500 నుంచి వెయ్యి వరకు సంపాదిస్తారు. ఒకప్పుడు పూరి గుడిసెలో ఉండే మేము ఇప్పుడు ఒక ఇల్లుతో పాటు పరిశ్రమ ఏర్పా టు చేసుకున్నాం. మాదన్న గూడెంలో అడవికి వెళ్లే దారి పక్కనే డీఆర్‌డీఏ ద్వారా సొంత భవనాన్ని ఏర్పాటు చేసుకుని పరిశ్రమ నిర్వహిస్తున్నాం.

- పల్ల శ్రీలత, విస్తరాకుల పరిశ్రమ నిర్వహకురాలు





మోదుగ విస్తరాకులు తయారు చేసే యంత్రం

న్యూస్ బాక్స్

13 నుంచి కార్తీక ఉత్సవాలు గూడెంగుట్టపై ఏర్పాట్లు పూర్తి



దండేపల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గూడెం రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో ఈనెల 13 నుంచి 15వరకు కార్తీక పౌర్ణమి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్య నిర్వహదికారి సంకటాల శ్రీనివాస్ తెలిపారు. 13న విశ్వక్సేణ ఆరాధన, అగ్నిప్రతిష్ఠ, బలిహరణం, సాయంత్రం తులసి కల్యాణం. 14న నిత్య హవణం, బలిహరణం, తీర్థ ప్రసాద వితరణ. 15న కార్తీక పౌర్ణమి రోజున మహాపూర్ణాహుతి, ప్రత్యేక పూజలు జరుగు తాయన్నారు. కార్తీక పౌర్ణమి రోజున రాత్రి సత్యదేవుడి నాటక ప్రదర్శన నిర్వహిస్తా మన్నారు. పౌర్ణమి ఉత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేశామన్నారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండ ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

నస్పూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు అవకాశం ఇచ్చి గెలిపిస్తే ఉద్యోగుల, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ యువతకు అవగాహన కల్పించి కొత్తగా లక్ష 40వేల ఓట్లను నమోదు చేయించామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల బలోపేతానికి కృషి చేస్తానన్నారు. అనంతరం పలు ప్రైవేట్ విద్యాసంస్థలకు వెళ్ళి ఉపాధ్యాయులను కలిశారు. ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేంద్రపాణి, నాయకులు రేగళ్ళ ఉపేందర్, కృష్ణారెడ్డి, సత్యనారా యణ, రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజ్ కుమార్, బషీరుద్దిన్, మమత పాల్గొన్నారు.

కూచిపూడి నృత్యంలో కళాకారుల ప్రతిభ



అవార్డులు అందుకుంటున్న కళాకారులు

గర్మిళ్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : హైద్రాబాద్‌లోని బొగ్గులకుంట తెలంగాణ సరస్వత పరిషత్ ఆడిటోరియంలో విశ్వ ఆర్ట్ ఆధ్వర్యంలో కార్తీకమాస నాట్యోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఇంగ్లీష్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌కు నిర్వహించిన నాట్యోత్సవంలో మంచిర్యాల జిల్లాకు చెందిన శ్రీనందిని నృత్యాలయం ఫౌండర్, నాట్య విభూషిని అన్నం కల్పన శిష్య బృందం సాధిక, అలోకి, నికిత, అభిజ్ఞలు కూచిపూడి నృత్య ప్రదర్శనలు చేసి ఆకట్టుకుని ప్రతిభ కనబర్చారు. వారి ప్రతిభను గుర్తించి ఇంగ్లీష్ బుక్ ఆఫ్ రికార్డును ప్రదానం చేశారు. అనంతరం గురువు కల్పనను ఘనంగా సన్మానించారు. కాగా ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు, నాట్య గురువులు ప్రదర్శనలు నిర్వహించారు.

క్రీడా సమాచారం

క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏసీపీ రవికుమార్

బెల్లంపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఆడాలని ఏసీపీ రవికుమార్ అన్నారు. శనివారం అండర్ 19 బాల బాలికల ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ సాఫ్ట్‌బాల్ పోటీల్లో బాల బాలికలు రాణించాలన్నారు. క్రీడలతో ఆరోగ్యంగా ఉంటారన్నారు. పోటీలకు ఉమ్మడి పది జిల్లాల నుంచి 360 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా టోర్నమెంట్ ఆర్గనైజర్ బాబురావు, కన్వీనర్ అంజయ్య ఆదిలాబాద్ జిల్లా పీడీ స్వామి, వ్యాయామ ఉపాధ్యాయులు రామ్మోహన్‌రావు, యాకూబ్, బండి రవి, చాంద్‌పాషా, రాజ్ మహ్మద్‌లు పాల్గొన్నారు.

రేపు జోనల్‌స్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు

మంచిర్యాల అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో తాళ్లపేట్‌లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 11న ఉదయం 9 గంటలకు అండర్-14 జోనల్ స్థాయి బాలుర వాలీబాల్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రెటరి ఫణిరాజా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో ఎంపికైన విద్యార్థులను రాష్ట్రస్థాయి మీట్‌కు పంపిస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు నాలుగు జతల ఎలిజిబులిటీ ఫార్మ్‌తో కన్వీనర్ రోజీవరకుమారి (పీడీ)ని కలవాలని, వివరాలకు 9989595232 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

లక్ష దీపోత్సవాన్ని విజయవంతం చేయాలి



పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్న చైర్‌పర్సన్

బెల్లంపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంసీ క్రీడా మైదానంలో ఈనెల 11న లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కులశ్వేత అన్నారు. శనివారం లక్ష దీపోత్సవ కార్యక్రమానికి సంబంధించి పూజా కార్యక్రమాలను నిర్వహించి పనులను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆధ్వర్యంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు, మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఏసీపీ రవికుమార్, ఆర్డీవో హరికృష్ణ, నాయకులు సూరిబాబు, మునిమంద రమేష్, దావ రమేష్ పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల


జన్నారం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మాలల మహా పాదయాత్ర పోస్టర్లను శనివారం మండల కేంద్రంలో మాల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ భద్రాచలం నుంచి హైద్రాబాద్ వరకు 16 జిల్లాల మీదుగా పాదయాత్ర చేపట్టడం జరుగుతుందన్నారు. దీన్ని మాలలు విజయవంతం చేయాలని కోరారు. నాయకులు బెంజిమెన్, నర్సింగ్, దేవేందర్, రాజన్న, రామస్వామి, బాలరాజు, మాణిక్యం, మమత, కరుణాకర్ , లక్ష్మీరాజం, ప్రబాకర్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయాలు కొనసాగించాలి

జన్నారం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అమరవీరుల ఆశయాలు కొన సాగించాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ మండల నాయకులు పురంశెట్టి బాపు అన్నారు. శనివారం మండలంలోని చింతగూడ గ్రామంలో అమవీరుల వీరుల వారోత్సవాల సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాడి దేవరాజ్, రజిత, పోశన్న, తది తరులు పాల్గొన్నారు.

కూలీల అడ్డా.. కాంటా చౌరస్తా..

● 30 ఏండ్లుగా ఇక్కడే ● పనుల కోసం పలు ప్రాంతాల నుంచి రాక



కాంటా చౌరస్తా వద్ద పనుల కోసం వేచి చూస్తున్న కూలీలు

బెల్లంపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లిలోని కాంటా చౌరస్తా 30 ఏండ్లుగా కూలీలకు అడ్డాగా మారింది. రోజువారి కూలీలు ఉదయాన్నే అడ్డాపైకి కూలీ కోసం వస్తుంటారు. స్థానికులే కాకుండా నియోజకవర్గంలోని ఆయా మండలాల కూలీలు సైతం రోజు వస్తుంటారు. వీరందరు సూర్యోదయానికి ముందే సద్దిమూటతో కాంటా చౌరస్తా వద్దకు వచ్చి కూలీ పనుల కోసం పడిగాపులు పడుతుంటారు. భవన నిర్మాణ మేస్త్రీలతో పాటు ఎవరికి ఏ పని ఉన్నా కాంటా చౌరస్తా వద్దకు వచ్చి కూలీలను తీసుకువెళ్తుంటారు. పని దొరికితే సంతోషం, లేదంటే ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి చార్జీలు సైతం ఖర్చయ్యే పరిస్థితుల్లో నిరాశతో వెనుదిరిగి వెళ్లి పోతారు. పని దొరకని కూలీలు ఉదయం 11 గంటల వరకు వేచి చూసి వెనుదిరుగుతారు. మహిళ కూలీలకు రోజుకు రూ. 600 నుంచి 700, మగ వారికి రూ. 700 నుంచి రూ. 800 చెల్లిస్తుంటారు.

● పలు మండలాల నుంచి...

కాంటా చౌరస్తాకు ఉదయాన్నే వందలాది మంది కూలీలు ఉపాధికోసం ఇక్కడకు వస్తారు. స్థానికులతోపాటు తాండూర్, కాసిపేట, సోమగూడెం, వ్యవసాయ పనులు లేని సమయంలో భీమిని, కన్నెపల్లి మండలాల నుంచి పనుల కోసం రోజు 300 నుంచి 400మంది కూలీలు కాంటా చౌరస్తా వద్దకు వస్తుంటా రు. 30ఏండ్ల క్రితం రామాటాకీస్ ఎదుట కూ లీలు పనుల కోసం నిల్చునేవారు. అక్కడి స్థలం ఇరుకుగా ఉండడంతో కాలక్రమేణా కాంటా చౌరస్తా కూలీల అడ్డాగా మారింది. కూలీలను తీసుకువెళ్లేందుకు అక్కడకు వచ్చిన సమయంలో పని ఉందాసార్ అంటూ వారి వద్దకు పోటా పోటీగా వచ్చి పనులు అడుగుతారు.

కాంటా చౌరస్తా వద్ద కూలీలు దొరుకుతారు



తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాను. ఇంటి నిర్మాణ పనుల కోసం కాంటా చౌరస్తా వద్దకు వస్తే కూలీలు దొరుకుతారు. మేస్త్రీలు పనులు ఉంటే కూలీల కోసం కాంటా చౌరస్తా వద్దకు వస్తారు. అన్ని రకాల పనులు వచ్చిన కూలీలు అందుబాటులో ఉంటారు.

- కోటేష్, తాపీమేస్త్రీ, బెల్లంపల్లి

కూలీలకు అడ్డాగా ..



కాంటా చౌరస్తా 30 ఏండ్లుగా కూలీలకు అడ్డాగా మారింది. భవన నిర్మాణ రంగంలో అన్ని పనులకు సంబంధించిన కూలీలు ఇక్కడ దొరుకుతారు. మేస్త్రీలు ఉదయం వచ్చి కూలీలను తీసుకుని వెళ్తారు. ఏ పనులకు సంబంధించిన కూలీలు అయినా ఇక్కడ ఉదయం అందుబాటులో ఉంటారు. ఉదయం 7 గంటలకే కాంటా చౌరస్తా వద్దకు వచ్చి పనుల కోసం వేచి చూస్తారు.

- రామ్‌కుమార్, భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడు

పని కోసం తాండూర్ నుంచి వచ్చా

తాండూర్ మండలంలోని ద్వారక గ్రామం. కూలీ పనుల కోసం రోజు కాంటా చౌరస్తా వద్దకు వస్తుంటాను. ఇక్కడకు వస్తే తప్పకుండా పని దొరుకుతుంది. ఏదో ఒక రోజు పని దొరక్కపోతే తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది. నాతో పాటు చాలా మంది మా ప్రాంతం నుంచి కూలీ పనుల కోసం ఇక్కడకు వస్తుంటారు.

- సంతోష్

కలెక్టరేట్ ఎదుట 48 గంటల ధర్నా

- ఐకేపీ ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు రంజిత్



సమావేశంలో మాట్లాడుతున్న రంజిత్ కుమార్

నస్పూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఐకేపీలో పని చేస్తున్న వీవోఏ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11, 12 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట 48 గంటల ధర్నా నిర్వహిస్తున్నట్లు ఐకేపీ వీవోఏ యూనియన్ (సీఐటీయు) గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్ కుమార్ అన్నారు. నస్పూర్‌లో శనివారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీవోఏల సమస్యలను పరిష్కరించడలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కలెక్టరేట్ ఎదుట 48 గంటల ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐకేపీ వీవోఏ యూనియన్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు కుంటాల కుమార్, దుర్గం రాములు, నాయకులు పొట్ట పోశం, గోగర్ల రజిత తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కుమరం భీం
జిల్లా వార్తలు
8
ఆదివారం 10 నవంబరు 2024

విద్యుత్‌శాఖ అధికారుల పొలం బాట

రెబ్బెన, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రెబ్బెన నంబాలో శనివారం విద్యుత్‌శాఖ అధికారులు పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ ప్రమాదాలు జరిగే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. కెపాసిటర్లు, భద్రతా జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఈ ఆర్ శేషారావు, డీఈ జీవరత్నం, ఏఈ ఇమ్రాన్, లైన్ ఇన్‌స్పెక్టర్ సురేష్, రైతులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ఆసిఫాబాద్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కార్మికశాఖ, సీఎస్‌ఎస్‌సీ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని లయన్స్‌క్లబ్ కార్యాలయంలో ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తారీక్ తెలిపారు. లేబర్ గుర్తింపుకార్డు ఉన్న కార్మికులకు ఉదయం 7నుంచి సాయంత్రం 4గంటల వరకు బీపీ, షుగర్‌తోపాటు 32రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు.వారం రోజుల్లోగా రిపోర్టులను అందజేస్తామన్నారు. లేబర్ గుర్తింపుకార్డు ఉన్న కార్మికులు ఉచిత వైద్యశిబిరంను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పాఠశాలల తనిఖీ

సిర్పూర్(యు), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజనసంక్షేమశాఖ పాఠశాలలను శనివారం మహగాం స్కూల్‌కాంప్లెక్స్ ప్రధానోధ్యాయురాలు రాంబాయి తనిఖీ చేశారు. పాఠశాలలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. విద్యార్థులను పలువిషయాలు అడిగితెలుసుకున్నారు. విద్యార్థులకు సులభంగా అర్థం అయ్యేవిధంగా బోధించాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. అదేవిధంగా ఆదర్శపాఠశాల పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయాపాఠశాల ఉపాధ్యాయులున్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి


ప్రశ్నపత్రాలను విడుదల చేస్తున్న జనవిజ్ఞాన వేదిక సభ్యులు

కౌటాల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని ప్రధానోపాధ్యాయుడు నారాయణసింగ్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చెకుముకి సైన్స్ సంబరాలకు సంబంధించిన ప్రశ్నపత్రాలను జనవిజ్ఞాన వేదిక సమన్వయకర్త ఉప్పుల నరసింహాచారి, ఉపాధ్యాయులతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంచందర్, శ్యాంరావు, రమేష్, రైస్ అహ్మద్, కవిత, సత్యనారాయణ, సంధ్యారాణి, యేసుమణి, విజయ్‌సింగ్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో ఇంకెన్నాళ్లు..?


బారెగూడలో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

- అరకొర వసతుల మధ్య అంగన్‌వాడీ కేంద్రాలు
- ఇబ్బందులు పడుతున్న చిన్నారులు, గర్భిణులు
- పట్టించుకోని అధికారులు

బెజ్జూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు అద్దెభవనాల్లో అరకొర వసతుల మధ్య కొనసాగుతున్నాయి. గతంలో కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా భవనాలు నిర్మించేందుకు స్థలాలు లేకపోవడంతో నిర్మాణాలకు మోక్షం లభించడంలేదు. దీంతో అద్దె భవనాల్లో సరైన సదుపాయాలు లేక చిన్నారులు, గర్భిణులు అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రభుత్వం స్త్రీ, శిశుసంక్షేమశాఖ ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల కోసం అనేక పథకాలు అందిస్తోంది. పిల్లలకు పౌష్టికాహారం అందించడంతోపాటు చదువు చెప్పడం, ఆటలు ఆడించడం, నిద్ర పుచ్చడం వంటివి చేయాల్సి ఉంటుంది. అద్దెభవనాల్లో అరకొరవసతులు ఉండటంతో చాలా మంది తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించేందుకు ఆసక్తి చూపడం లేదు.

జిల్లాలో 973అంగన్‌వాడీ సెంటర్లు..

జిల్లా వ్యాప్తంగా 973అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 317కేంద్రాలకు మాత్రమే పక్కా భవనాలు ఉన్నాయి. 353అంగన్‌వాడీ కేంద్రాలు ఆయా గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో ఒక గదిలో నిర్వహిస్తున్నారు. ఇక 303కేంద్రాలు అద్దె భవనాల్లో అసౌకర్యాల నడుమ కొనసాగుతున్నాయి. 0-7నెలల చిన్నారులు 4898, 7-12నెలల వారు 5695, 1-3సంవత్సరాల చిన్నారులు 17,809, 3నుంచి 6ఏళ్ల చిన్నారులు 20,682, గర్భిణులు 4609, బాలింతలు 4961మంది ఉన్నారు.

ముఖ్యంగా అర్బన్ ప్రాంతాల్లో అద్దె భవనాల్లో నిర్వహించే కేంద్రాలకు భవనాల చుట్టు పక్కల ఖాళీ స్థలం లేకపోవడం, గదులు ఇరుకుగా ఉండటంతో పిల్లలు ఉండలేని పరిస్థితి నెలకొంది. కొన్ని అద్దెభవనాల్లో మంచినీరు కూడా దొరకని పరిస్థితులు ఉన్నాయి. నీటి వసతిలేక అంగన్‌వాడీ ఆయాలు కేంద్రం నుంచి బయటకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. పట్టణప్రాంతాల్లో రెండు, మూడు రోజులకో సారి నీటిని తెచ్చి నిల్వ ఉంచుకొని వాడుకోవాల్సి వస్తోంది. దీంతో ప్రతినిత్యం బయటి ప్రాంతాల నుంచి తాగునీరు తీసుకరావడం ఇబ్బందిగా మారిందని అంగన్‌వాడీలు వాపోతున్నారు.

మరమ్మతులే దిక్కు..

జిల్లాలోని పలు అంగన్‌వాడీకేంద్రాలకు పక్కా భవనాల నిర్మాణాల కోసం రెండేళ్లక్రితం అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా వాటిని నిర్మించేందుకు స్థలాలు లేక మోక్షం కలగడం లేదు. ప్రతీ అంగన్‌వాడీకేంద్రాన్ని ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించాలని స్త్రీశిశు సంక్షేమ శాఖ నిర్ణయించింది. ప్రభుత్వం సైతం ప్రాథమిక పాఠశాలల్లో అంగన్‌వాడీకేంద్రాలను నిర్మించాలని సూచించింది. అయితే కేంద్రప్రభుత్వం నీతి ఆయోగ్, శ్యాంప్రసాద్ ముఖర్జీ రూర్బన్ కింద 22 కేంద్రాలకు మరమ్మతుల కోసం నిధులు మంజూరుచేసినా పనులు పూర్తికాలేదు. అదే విధంగా సాక్ష్యం అంగన్‌వాడీ కింద మరమ్మతుల కోసం ఒక్కో కేంద్రానికి రూ.2లక్షలు, టాయిలెట్ల మరమ్మతుల కోసం రూ.36వేలు, తాగునీటికోసం రూ.17 వేలు, ఇతరపనుల కోసం 100కేంద్రాలకు రూ.36 వేల చొప్పున నిధులు మంజూరు చేసినా పూర్తి స్థాయిలో పనులు కాలేదు. కొత్త అంగన్‌వాడీ కేంద్రాలకు ఎలాంటి నిధులు మంజూరు లేక ఉన్న భవనాలకు మరమ్మతుల కోసం నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. అయినా అంగన్‌వాడీ కేంద్రాలను మరమ్మతులు చేపట్టని కారణంగా చిన్నారులకు అవస్థలు తప్పడం లేదు. మరమ్మతులకు నిధులు మంజూరైనా పనులు పూర్తి కాక ఇబ్బందులు పడాల్సివస్తోంది. దీంతో ఇటు పాఠశాలల్లో కేంద్రాలు నిర్వహించడం వల్ల అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులు, పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అయినా అధికారులు భవనాలు నిర్మించడంలో నిర్లక్ష్యం వహించడంవల్ల ఇరు శాఖల వారు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..

ఆడెపు భాస్కర్, జిల్లా సంక్షేమాధికారి, ఆసిఫాబాద్



జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలను పక్కాభవనాలు నిర్మించేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. ఇప్పటికే పలుమార్లు నివేదికలు పంపినా నిధులు విడుదల కాలేదు. భవనాలు మంజూరయ్యే వరకు ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రస్తుతం భవనాలు లేనిచోట పాఠశాలల్లో కేంద్రాలను నిర్వహిస్తున్నాం. శిథిలావస్థకు చేరిన భవనాలకు మరమ్మతులు చేయిస్తాం.

అర్హులందరినీ ఓటరుగా నమోదు చేయాలి: కలెక్టర్


ఓటరు నమోదు పత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హత గల 18సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఓటరు నమోదుసవరణల కోసం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్ వద్ద ప్రత్యేక ప్రచార దినాల్లో భాగంగా బీఎల్‌వోల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రాన్ని ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 18సంవత్సరాలునిండిన ప్రతిఒక్కరిని ఓటరుగా నమోదు చేస్తామని తెలిపారు. దీనికోసం శని,ఆదివారాల్లో ప్రత్యేకప్రచారదినాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూతనఓటరు నమోదుకోసం ఫాం-6, అభ్యంతరాలు ఫాం-7,సవరణలకుఫాం-8ద్వారా దరఖాస్తుచేసుకోవాలన్నారు.జనవరి1, 2025నాటికి 18సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం


దిష్టి బొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నాయకులు

ఆసిఫాబాద్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మాజీముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన బుల్డోజర్ వ్యాఖ్యలు నిరసిస్తూ శనివారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని అంబేద్కర్‌చౌక్‌లో సీఎం దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం నోటికి వచ్చినట్లు మాట్లాడడం సరైన విధానం కాదన్నారు. మూసి ప్రక్షాళన పేరుతో కోట్లు కాజేసే ప్రయత్నం చేస్తున్నారని దీన్ని ఆపేప్రయత్నం చేయడానికి సిద్ధమవుతున్న ప్రతిపక్షాలను అడ్డుకుంటున్నారన్నారు. మూసీప్రక్షాళన అడ్డుకుంటే బుల్డోజర్లతో తొక్కిస్తామని వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు అలీబీన్ అహ్మద్, రవి, అన్సార్, షౌమద్, నిసార్, శ్రీనివాస్, భీమేష్, నారాయణ, కాసీం, బలరాం తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ మహిళలకు బ్లాంకెట్‌లు పంపిణీ


బ్లాంకెట్లతో ఆదివాసీ మహిళలు

సిర్పూర్ (యు), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లార గ్రామంలో శనివారం రాణిదుర్గావతి మహిళా ట్రైబల్‌వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివాసీ మహిళలకు బ్లాంకెట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సొసైటీ అధ్యక్షురాలు గోడం జంగుబాయి మాట్లాడుతూ పెరుగుతున్న చలిని దృష్టిలో పెట్టుకుని ఆదివాసీగ్రామాల్లో బ్లాంకెట్లు పంపిణీచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సభ్యులు ఆత్రంతులసీబాయి, అనకరాంబాయి, మెస్రం కమలబాయి, కుర్సుంగా గంగుబాయి, ఆత్రంతీర్థబాయి, కుమ్రరాధబాయి పాల్గొన్నారు.

సర్వేలో నోడల్ అధికారులది కీలకపాత్ర


కాగజ్‌నగర్‌లో సర్వేను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

ఆసిఫాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా శనివారం నుంచి ప్రారంభమైన ప్రశ్నావలి సేకరణ పకడ్బందీగా చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో ఆయన వివిధశాఖల అధికారులు, నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రారంభమయ్యే ప్రశ్నావళి సేకరణలో నోడల్‌అధికారులు ప్రముఖపాత్ర పోషించాలన్నారు. సూపర్‌వైజర్లపై, ఎన్యూమరేటర్లపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. రోజువారీగా పూర్తిచేసే వివరాలను సాయంత్రం 6లోపు అందజేయాలన్నారు. ఎక్కడైనా తప్పు జరిగితే వెంటనే దానిని సవరించేలా పనిచేయాలని కప్పి పుచ్చేలా పని చేయకూడదన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సర్వే జిల్లాలో ఎటువంటి తప్పులు లేకుండా చూడాల్సిన బాధ్యత నోడల్ అధికారులపై ఉందన్నారు. ఎన్యుమరేటర్లు రోజుసర్వేకు సంబంధించిన పేపర్లు ప్రతి రోజు ఎంపీడీవో కార్యాలయంలో ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. క్షేత్రస్థాయిలో ఏవైనా ఇబ్బందులు తలెత్తితే వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. సర్వేపట్ల ప్రజల్లో ఏమైనా అపోహలు ఉంటే వాటిని తొలగించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: సమగ్ర కుటుంబ సర్వేను పక్కాగా చేపట్టాలని కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా తెలిపారు. శనివారం కాగజ్‌నగర్ పట్టణంలోని పలువార్డుల్లో సర్వే చేపడుతున్న సిబ్బందిని వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వేలో తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, కమిషనర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేను పరిశీలించిన కలెక్టర్

ఆసిఫాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని వార్డునెం.15లో నిర్వహిస్తున్న సమగ్ర సర్వేతీరును కలెక్టర్ వెంకటేష్‌దోత్రే పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వేలక్ష్యాన్ని నెరవేర్చే బాధ్యత ఎన్యురేటర్లపై ఉంటుందన్నారు. నిర్దేశించిన ఫారంలో ఇచ్చిన ప్రతిఅంశాన్ని ప్రజల నుంచి సేకరించాలని సూచించారు. అందుబాటులో లేని వారి దగ్గరికి మరోసారి వెళ్లాలన్నారు.ఏ ఇంటిని కూడా వదిలి పెట్టకూడదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


ఆసిఫాబాద్ వార్డునం.15లో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆదర్శ కమ్యూనిస్టు టీఎస్ వెంకటరమణ

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

కాగజ్‌నగర్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆదర్శ కమ్యూనిస్టు టీఎస్ వెంకటరమణ అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. శనివారం పట్టణంలోని రాయల్‌గార్డెన్స్‌లో ఆచరణవాది టీఎస్ వెంకరమణ పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఎంతోమంది తాము కమ్యూనిస్టులమని చెప్పుకుంటున్నా వారికి సిద్ధాంతంపై పూర్తిగా పట్టు ఉండదన్నారు. కానీ వెంకటరమణ మాత్రం కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని లోతుగా అధ్యయనం చేశారని, దానిని పది మందికి చెప్పుతూ ఎంతో మంది కమ్యూనిస్టులను తయారు చేశారని కొనియాడారు. ఆయన ఆదర్శాన్ని పుణికిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి పాడుగు బాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు జిరాములు రచించిన నక్సలిజం నాకేం నేర్పింది అనే పుస్తకాన్ని తమ్మినేని వీరభద్రం ఆవిష్కరించారు.

నిత్యాన్నదాన సత్రం పరిశీలన..

కాగజ్‌నగర్ బస్టాండులో మాజీఎమ్మెల్యే కోనేరు కోనప్ప చేపడుతున్న నిత్యాన్నదాన సత్రాన్ని శనివారం సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పరిశీలించారు. ఈ సందర్భంగా అన్నదానం సమకూరుస్తున్న తీరుతెన్నులపై కోనేరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కోనేరు వంశీని వివరాలు అడిగితెలుసుకున్నారు. ఆయన వెంట స్థానిక నాయకులున్నారు.

సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క


వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్, సబ్ కలెక్టర్

ఆసిఫాబాద్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర కుటుంబ సర్వే నమోదును పకడ్బందీగా చేపట్టాలని ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. శనివారం హైదరాబాద్ నుంచి ప్రభుత్వప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఇతరఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్‌తో సర్వేనిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ కలెక్టర్లు, ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లతో నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. ఈ ప్రక్రియనిర్వహణ సమయంలో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలను ఆహ్వానించాలని తెలిపారు. ఇంటింటి సమగ్రసర్వే నేపథ్యంలో ప్రజల కువచ్చే అనుమానాలను నివృత్తిచేస్తూ ముందుకు సాగాలని, ఎన్యూమరేటర్లు తమకు ఎలాంటి సందేహాలు ఉన్నా కలెక్టర్ల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రజలపట్ల ఎన్యూమరేటర్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ప్రజల సమగ్ర సమాచారం సేకరణవల్ల అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేసేందుకు దోహదపడుతుందన్నారు.ఇళ్ల జాబితా ప్రక్రియ విజయవంతం ముగిసిందని, ఇదే స్ఫూర్తితో సర్వే పూర్తయ్యే వరకు పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. సర్వేలో భాగస్వామ్యం అయిన కలెక్టర్లు, ఎన్యూమరేటర్లు, ప్రణాళికాశాఖ అధికారుల పనితీరుఅభినందించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేష్ దోత్రే జిల్లా అధికారులతో సర్వే ప్రక్రియ నిర్వహణపై సమీక్షసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేకొరకు జారీచేసిన బుక్‌లెట్‌లోని మొత్తం అంశాలపై ఎలాంటి అనుమానాలు, సందేహాలకు తావులేకుండా ప్రజలనుంచి ఖచ్చితమైన సమాచారం సేకరించి స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. సర్వేను సూపర్‌వైజర్లు, మండల ప్రత్యేకాధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సర్వేప్రక్రియ పూర్తి అయినందున ఎన్యూమరేటర్లకు సర్వేఫారాల కొరతలేకుండా అందజేయాలని డాటా ఎంట్రీ కేంద్రాలు పూర్తివసతులతో సిద్ధంగా ఉంచాలని తెలిపారు.

మోదీ ఫాసిజానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి

- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎండీ చాంద్‌పాషా




సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ చాంద్ పాషా

రెబ్బెన, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ఫాసిజానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లాకార్యదర్శి ఎండీ చాంద్‌పాషా పిలుపునిచ్చారు. శనివారం గోలేటి టౌన్ షిప్‌లో సివిక్ కార్యాలయ ఆవరణలో ఆ పార్టీ ఆధ్వర్యంలో భారత విప్లవోద్యమంలో అసువులు బాసిన అమరవీరుల వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మోదీ ఫాసిజం పెరిగిందన్నారు. హిందూ మతం పేరుతో రాజకీయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఓట్ల కోసం పార్టీల మధ్య చిచ్చు పెడుతున్నట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బండారి తిరుపతి, జగజంపుల తిరుపతి, అరికిళ్ల పోశం, కార్మికులు చందు, శంకర్, సోమయ్య, వెంకటేష్, స్వామి, లక్ష్మి, కవిత, శంకరమ్మ, తార, నాగలక్ష్మి, ఇంద్ర, పద్మ, కమల, తదితరు పాల్గొన్నారు.

రవీంద్రభారతిలో 'వసుధాశతక' పుస్తకావిష్కరణ

ఆసిఫాబాద్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): భారత్ కల్చరల్ అకాడమి తెలుగు టెలివిజన్ రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రజాకవి కాళోజి రాష్ట్రస్థాయి కవితలపోటీలను శనివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించగా నవజ్యోతి సాహితీ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు, ఆసిఫాబాద్ కవుల సంఘంపద్యకవి ధర్మపురి వెంకటేశ్వర్లు రచించిన వసుధాశతక పుస్తకాన్ని ప్రముఖ సినీపాటల రచయిత మల్లిక్, సినీ రచయిత, దర్శకుడు నాగబాల సురేష్‌కుమార్, రచయిత అక్కినేని శ్రీధర్, వేనిగాళ్ల రాంబాబు, సాధనాల వెంకటస్వామి నాయకుడు, తెలుగు టీవీరచయితల సంఘం అధ్యక్షుడు ప్రేంరాజ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన కవిసమ్మేళనంలో ధర్మపురి వెంకటేశ్వర్లు, చిలుకూరి రాధాకృష్ణచారి, కవితా పఠనం చేశారు. వారిని ప్రముఖ కవులు ప్రశంసించారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు, కవులు

చిత్ర కళాకారుడు ఆనంద్‌కుమార్‌కు సన్మానం


మడావి ఆనంద్‌రావ్‌ను సత్కరిస్తున్న హెచ్‌ఎం అనిత, ఉపాధ్యాయులు

జైనూర్, నవంబరు9,(ఆంధ్రజ్యోతి): చిత్రకళా ప్రదర్శనలో రాష్ట్రపతిచేతుల మీదుగా పురస్కారం అందుకున్న మండలం లోని రాసిమెట్టకు చెందిన మడావి ఆనంద్‌రావ్‌ను ప్రభుత్వ బాలికల ఆశ్రమోన్నత పాఠశాల ఉపాధ్యాయులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల హెచ్‌ఎం అనిత, ఎస్సీఈఆర్పీ ఉయికశంకర్, ఉపాధ్యాయులు చిత్రకళాకారుడు ఆనంద్‌రావ్‌కు మెమోంటోను అందజేశారు. కార్యక్రమంలో ఆర్టిస్ట్ మడావి రాజేశ్వర్, ఉపాధ్యాయులు గజానంద్, గణపత్, విద్యార్థులు పాల్గొన్నారు.

కనులవిందుగా పెద్దవాగు


పెంచికలపేట పెద్దవాగు నదితీరాన కనువిందు చేస్తున్న సూర్యకిరణాలు

పెంచికలపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): చిత్రకారుడు గీసిన చిత్రంలా కనిపిస్తున్న ఈ సుందరదృశ్యం పెంచికలపేట పెద్దవాగు వంతెన వద్ద శనివారం సూర్యోదయ సమయంలో ఆవిష్కృతమైంది. ఓ పక్కనపొగ మంచు తెరలు తెరలుగా విడిపోతూ సూర్య కిరణాలు భూమిని తాకుతున్న సమయంలో పెద్దవాగు నీటిప్రవాహం ఇసుక తిన్నెలు కనువిందు చేశాయి. వంతెన మీదుగా ప్రయాణించిన వాహన చోదకులు, వ్యాయామం చేసేందుకు వచ్చిన యువకులు ఈ ప్రకృతి సోయగాన్ని ఆస్వాదించారు.